క్లుప్తంగా

2న వికలాంగుల చలో ఢిల్లీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడి, నిరాదరణకు గురవుతున్న వికలాంగులు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వేదిక ప్రధాన కార్యదర్శి పోసి కుమార్ అధ్యక్షత ఆగస్టు 2న జరిగే వికలాంగుల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు, రెడ్డి అనంద్, దాసరి అబ్బులు, రాపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

వసతుల పరిశీలన

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం స్థానిక ప్రకాశం నగర్‌లోని గ్రేస్ మిషన్ హోమ్ ఫర్ బాయ్స్, ఏవీ రోడ్డులోని గ్రేస్ హోమ్ ఫర్ గరల్స్ గృహాలను సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి, భోజనం, ఇతర సదుపాయాలు అందుతున్న తీరుపై పిల్లలతో మాట్లాడారు.

పిల్లలు లేరని మహిళ ఆత్మహత్య

కంబాలచెరువు: పిల్లలు లేరనే మనస్తాపంతో టి.నగర్‌కు చెందిన యర్రా శివప్రసాద్ (44) అనే వివాహిత శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు నగరానికి చెందిన ధనరాజుతో 25 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. అయితే వీరికి పిల్లలు కలగలేదు. ఇదిలావుండగా వారం రోజుల క్రితం తమ బంధువుల ఇంటిలో జరిగిన సీమంతం వేడుకకు వెళ్లి వచ్చింది. ధనరాజు గ్యాస్ సిలెండర్లు డెలివరీ చేసే పనికి వెళ్లి తిరిగి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఆమె ఉరివేసుకుని వేలాడుతూ ఉంది. విషయం తెలిసిన రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని ఒక నర్సరీలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 4,370 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శివాజీ తెలిపారు.

కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్ఎం సర్కిల్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల ధర్నా రెండోరోజు శుక్రవారం కొనసాగింది. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయలో బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జగతా అచ్యుత రామయ్య మాట్లాడుతూ యాజమాన్యం మొండివైఖరిని నిరసిస్తూ దశల వారీగా ఉద్యమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. సెక్రటరీ జనరల్ ఎంఎస్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. హాట్‌లైన్స్ కె.రామరాజు, 1104 రీజినల్ ప్రెసిడెంట్ పి.సురేష్‌బాబు, విజయ శ్యామల పాల్గొన్నారు.

అడుగంటిన అభివృద్ధి

సీటీఆర్‌ఐ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి అడుగంటి పోయిందని, సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తుకు గ్యారెంటీ – ఆదిరెడ్డితో అడుగేద్దాం కార్యక్రమాన్ని 1, 50 వార్డుల్లో పూర్తి చేశామన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నామన్నారు.

ఉద్యోగుల స్పందనకు 25 అర్జీలు



కార్యక్రమంలో పాల్గొన్న జేసీ తేజ్ భరత్

ప్రకాశం నగర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం డీఆర్‌వో జి.నరసింహంతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ, ఉద్యోగస్తులకు భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వీస్ మేటర్, పదోన్నతులు, ఇతర సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కాగా.. ఉద్యోగుల నుంచి 25 అర్జీలు స్వీకరించామన్నారు. ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తామని తెలిపారు.

వరద వేళలో బాధితులకు అండగా..

- చర్యలు తీసుకున్న ప్రభుత్వం
- పునరావాస కేంద్రంలో వసతి
- అన్ని సదుపాయాల కల్పన



ఆల్కాట్‌తోట పునరావాస కేంద్రంలో లంక గ్రామాల మహిళలు, పిల్లలు

ప్రకాశం నగర్: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంక గ్రామాల్లో ప్రజల ఇళ్లు పూర్తిగా నీటమునిగాయి. ప్రస్తుతం ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం సుమారు 215 మంది లంక గ్రామాల ప్రజలను ఆల్కాట్‌తోటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వీరిలో కేతవారిలంక, బ్రిడ్జిలంక, వెదురులంకకు చెందిన మహిళలు, చిన్నారులు, పురుషులు ఉన్నారు. పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

మెరుగైన సదుపాయాలు

ఆల్కాట్‌తోట మున్సిపల్ కల్యాణ మంటపంలోని పునరావాస కేంద్రంలో వరద బాధితులకు మెరుగైన సదుపాయాలు కల్పించారు. అక్కడ మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టారు. తాగునీరు, ఇతర వసతులు కల్పించారు. బాధితులకు అల్పాహారం, రెండు పూటలా భోజనం, స్నాక్స్ అందిస్తున్నారు. పడుకోవడానికి వీలుగా సదుపాయాలు కల్పించారు.

వైద్యశిబిరం ఏర్పాటు



వరద బాధితులకు భోజనం అందిస్తున్న దృశ్యం



పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం

పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏఎన్‌ఎం నిరంతర పర్యవేక్షణతో పాటు ఒక డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. మందులు, సిరప్‌లు అందుబాటులో ఉంచారు. ఈ కేంద్రానికి మరింత మంది బాధితులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సదుపాయాలు బాగున్నాయి



బ్రిడ్జిలంకలో మా ఇల్లు మునిగిపోవడంతో పిల్లలతో కలిసి గురువారం సాయంత్రం ఇక్కడికి వచ్చాం. నా భర్త సతీష్ పడవను చూసుకుంటే అక్కడే ఉన్నాడు. ప్రతి ఏడాది గోదావరికి వరద వచ్చినప్పుడు ఆడవాళ్లు, పిల్లలు పునరావాస కేంద్రాలకు వచ్చేస్తాం. ఇక్కడ భోజనం, తాగునీరు, పిల్లలకు పాలు వంటి అన్ని సదుపాయలు కల్పిస్తున్నారు.

– మల్లాడ సత్యవతి

మందులు ఇస్తున్నారు



పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు ఇస్తున్నారు. నేను గర్భవతిని కావడంతో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నా భర్త దుర్గాప్రసాద్ మత్స్యకారుడు. పడవతో బ్రిడ్జిలంకలో ఉన్నాడు. వరద తగ్గాక మా లంకకు వెళ్లిపోతాం.

– పరిమళ

గొంతువాపు నివారణ టీకాలు

కడియం: వరద ప్రభావిత ప్రాంతాల్లోని పశువులకు గొంతువాపు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ ఏడీ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. గొంతు వాపు వ్యాధి కారణంగా పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించి టీకాలు వేయించాలన్నారు. ఈ మేరకు పొట్టిలంకలో శుక్రవారం పాడిపశువులకు టీకాలను శుక్రవారం వెటర్నరీ సిబ్బంది వేశారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, స్థానిక నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారి శ్రీరామ్ రవికిరణ్, రైతులు గట్టి గంగాధర్, రాంబాబు పాల్గొన్నారు.


10 నుంచి సమ్మె

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఆగస్టు 10వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాజమహేంద్రవరం సర్కిల్ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్‌ఈ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.

మల్లేశ్వరునికి భారీగా కౌలు ఆదాయం

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి వారి భూములకు కౌలు భారీగా పెరిగింది. శుక్రవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేలానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు. గతంలో 4.33 ఎకరాలకు రూ.1,16,910 మాత్రమే శిస్తుగా చెల్లించేవారు. అయితే ఈ ఏడాది రూ.9,99,000లకు పంతం వెంకటరమణ దక్కించుకున్నారు. అలాగే 4.82 ఎకరాలకు గతంలో రూ.1,75,500 మాత్రమే చెల్లించేవారు. ఈసారి రూ.11 లక్షలకు కుప్పాల శ్రీకాంత్ దక్కించుకున్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, ఈవోలు బీవీ సుబ్బారావు, శ్రీనివాసరావుల సమక్షంలో జరిగిన ఈ వేలంలో ఆలయ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ రాఘవ కుమారి

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రకృతి నుంచి మానవాళి ప్రేరణ, ఓదార్పును పొంది, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పరచుకోవాలన్నారు. దీనివల్ల సహజ వనరులు స్థిరంగా ఉండి ఆరోగ్యకరమైన సామాజిక వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. మొక్కలు, జంతువులుల అంతరించి పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మానవాళిదేనన్నారు. కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనూరాధ, సూర్యకుమారి, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

కార్మిక సదస్సును జయప్రదం చేయండి

ప్రకాశం నగర్: విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర కార్మిక, కర్షక సదస్సును జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర ట్రేడ్ యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, గారపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన మూడు నల్ల రైతు చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్తు సంస్కరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంకటాల బుద్ధుడు, చంద్రబోస్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

గోదావరి వరదపై ఆందోళన వద్దు

- సహాయక చర్యలు చేపడుతున్నాం
- ఎంపీ భరత్ రామ్



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద పరిస్థితిపై ఆరా తీస్తున్న ఎంపీ భరత్ రామ్



డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుకు వరద పరిస్థితిని వివరిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు

ధవళేశ్వరం: గోదావరి వరద నేపథ్యంలో కాటన్ బ్యారేజీ వద్ద ఉధృతిని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్ వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, హెడ్‌వర్క్స్ ఏఈ ఏ.సాయిరామ్, ఏఈ సత్యనారాయణతో ప్రస్తుత వరద ఉధృతి, తీసుకుంటున్న చర్యలు, రాగల 18 గంటల్లో వరద ప్రభావం తదితర వాటిపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరదపై ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎప్పటికప్పుడు కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని అందుకు తగ్గట్టు ఆదేశాలు జారీ చేస్తున్నారని వెల్లడించారు.

సీతానగరం మండలంలో రెండు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేయడం, కోనసీమ రాజోలులో బండ్ల పటిష్టత తదితర చర్యలను అధికార యంత్రాంగం చేపట్టిందన్నారు. గోదావరి పరీవాహక గ్రామాలు, లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌వీ శ్రీనివాస్, సీతారామకృష్ణ, యజ్జరపు మరిడయ్య పాల్గొన్నారు.

▸▸ గోదావరి వరద ఉధృతిని శుక్రవారం డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరిశీలించారు. ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావుతో మాట్లాడారు. నదీ పరీవాహక ప్రాంత ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఒంటెద్దు కృష్ణ, శ్రీరంగం బాలరాజు, ఎల్‌వీ ప్రసాద్, గూటం రాజు, నంబూరి రవి, బొడ్డేటి శివాజీ ఉన్నారు.

గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్‌గా కొండబాబు



కొండబాబుకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్, కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్‌గా మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని ఎంపీ మార్గాని భరత్ రామ్, కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ శుక్రవారం కొండబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలోని పలు దేవాలయాలకు పాలక మండళ్లను నియమిస్తూ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కోటిలింగాల దేవస్థానానికి చైర్మన్‌గా అరిగెల బాబు, విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి నిడమర్తి దుర్గా శ్రీనివాస్, కన్నమ్మ పేరంటాళ్ల అమ్మవారి ఆలయానికి దుంపచంద్రారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఉమా మార్కండేయ స్వామి ఆలయ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిందన్నారు. ఆ దేవస్థానం చైర్మన్ యిన్నమూరి ప్రదీప్ (దీపు) దాదాపు రూ.కోటిన్నర నిధులతో (దాతల విరాళాలు) అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషమని తెలిపారు. శనివారం రూ.27 లక్షలతో ఆలయానికి రంగులు వేసే కార్యక్రమాన్ని ఆ దేవస్థానం పాలకమండలి చేపడుతోందన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



స్టేషన్‌ను పరిశీలిస్తున్న ధర్మేంద్ర కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిచ్చి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని విజయవాడ డివిజనల్ సీఎంపీఈ ధర్మేంద్ర కుమార్ అధికారులకు ఆదేశించారు. ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. మెడికల్ రిలీఫ్ వ్యాన్‌లో మందులు, స్టేషన్ ఆవరణ, బుకింగ్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, ప్లాట్‌ఫారాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఎం గంగా ప్రసాద్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, సీటీఐ చంద్రమౌళి ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు



కడియంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి వచ్చాయని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి కేఎన్ జ్యోతి అన్నారు. వెంకటనగరం గ్రామ సచివాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల పత్రాలు అందజేశారు. సచివాలయ కన్వీనర్లు గంధ్రోతు విష్ణుమూర్తి, తలారి వెంకటేశ్వర్లు, గిడ్ల గీత, మోర్తా రమేష్, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి పాల్గొన్నారు.

▸▸ కోలమూరు సచివాలయం4లో మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్‌కుమార్ అధ్యక్షతన 2,861 మందికి పత్రాలు అందజేశారు. సచివాలయ కన్వీనర్లు తాటికొండ విష్ణు, పరిమి దుర్గారావు, ఉల్లింగి నవీన్, పిన్నమరెడ్డి సూర్యచంద్రం, నల్లమిల్లి సుబ్బారావు, వాకపల్లి సుదర్శనరావు పాల్గొన్నారు.

2,683 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

కడియం: మండల కేంద్రమైన కడియంలోని సచివాలయం 3 పరిధిలో 1537 మందికి, 4 పరిధిలో 1,146 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. కడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. శాకా పట్టాభి, సురేష్, గుత్తుల వాసు, దాసరి శేషగిరి, బండారు శ్రీను, లావేటి రమేష్, సర్కార్ బాషా పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

సీటీఆర్‌ఐ: మణిపూర్ అల్లర్లకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడారు. ఆ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ఈ ఘటనలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. కుకీ, నాగ గిరిజన తెగలను అటవీ ప్రాంతం నుంచి తరిమేసి అడవిలోని ఖనిజ సంపదను అదానీకి దోచిపెట్టాలని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కేకే సంజీవరావు, ఉపాధ్యక్షుడు ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జార్జి ఆంటోని, మేడిశెట్టి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

31న మణిపూర్ ఘటనలపై ర్యాలీ

కంబాలచెరువు: మణిపూర్‌లో మహిళలు, క్రైస్తవులపై జరుగుతున్న హింసాత్మక ఘటనలపై జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల 31న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సిన్హా గురువారం ప్రకటనలో తెలిపారు. అక్కడ ప్రజలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శాంతి, సమాధానాలు నెలకొల్పే విధంగా తామంతా సంఘీభావంతో ఈ ర్యాలీ చేపట్టామన్నారు. ఏవీ అప్పారావు రోడ్డు నుంచి సీఎస్ఎన్ చర్చి, దేవీచౌక్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ సాగుతుందన్నారు.

గోదావరి వరదతో ముంపు భయం



బొమ్మూరు నేతాజీ నగర్ ప్రధాన వీధిలో నీరు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద నేపథ్యంలో బొమ్మూరు నేతాజీనగర్, హుకుంపేట సావిత్రీ నగర్ వాసులు భయంభయంగా ఉన్నారు. ఇప్పటికే నేతాజీ నగర్ ప్రధానవీధి ముంపునకు గురైంది. ఉదయానికి మిగిలిన ప్రాంతం అంతా మునిగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజమహేంద్రవరం నగరం నుంచి మురుగునీరు హుకుంపేట ఆవకాలువ మీదుగా బాలాజీపేట నుంచి బొమ్మూరు మీదుగా ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. నాలుగు రోజులుగా గోదావరి ఉధృతంగా ఉండడంతో సాయిబాబా గుడి వద్ద గేటు మూసుకుపోయి, మురుగు నీరు వెనక్కు తన్నుతోంది. ఈ నేపథ్యంలో బొమ్మూరు నేతాజీ నగర్ ప్రధానవీధికి ముంపు బారిన పడింది. గతేడాది సెప్టెంబర్‌లో గోదావరి ఉధృతికి నేతాజీ నగర్, సావిత్రీ నగర్ ప్రాంతాలు వారం రోజుల పాటు మోకాళ్లలోతు నీటిలోనే ఉన్నాయి.